క్లుప్తంగా

రూ.10 కోట్లతో రోడ్ల మరమ్మతులు



పొదలకూరు- సోమశిల రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ మురళీకృష్ణ

కలువాయి: నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వెంకటగిరి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు అర్బన్‌లో ఉన్న 48 రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని రోడ్లు భవనాల శాఖ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం కలువాయి మండలంలోని రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయని, జనవరి నెలఖారుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. రాజుపాళెం పరమానంద ఆశ్రమం సమీపంలో దెబ్బతిన్న వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి రూ.70 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో మంజూరవుతాయని వివరించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ డీఈ అమానుల్లా, ఏఈఈ అన్వేష్ ఉన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం

చిల్లకూరు : పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పారిచెర్ల వారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండ్ల సుధాకర్ ఆకాంక్షించారు. పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల కమిటీ కో ఆప్షన్ సభ్యుడు ప్రదీప్ దాతృత్వంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఫలితాలు వాటంతట అవే వస్తాయన్నారు. తద్వారా భవిష్యత్తు బాగుంటుందని వివరించారు. పిల్లలకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన ప్రదీప్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, చంద్ర, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, నాగభూషణమ్మ, సురేంద్ర, గ్రామ పెద్ద సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

సైదాపురం: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం లాభదాయకమని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని లింగసపాళెంలో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుకుళ్లు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంటలను పొందాలంటే పరిమిత ఎరువులను వాడాలన్నారు. అనంతరం ఆమె నిమ్మ తోటలను పరిశీలించారు. పురుగు మందులు స్ప్రే చేసే సమయాల్లో రైతులు పాటించాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి




మాట్లాడుతున్న సీడీపీవో శంషాద్ బేగం

వెంకటగిరి రూరల్ : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వెంకటగిరి ఎంపీపీ తనుజారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. అనంతరం బాల్య వివాహాల నియంత్రణ, ఆత్మ రక్షణ- భద్రత, మానసిక ఆరోగ్యం, జీవనోపాధి అవకాశాలు, యోగా తదితరాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎస్ఐ సుబ్బారావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

కండలేరులో 56.832 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 56.832 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,050, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలను కమ్మేస్తున్న పొగ



పెన్నేపల్లిలో ఉన్న స్టీల్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న దట్టమైన పొగ

'ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్య, వైద్యం, ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నాం.' అని కూటమి నేతలు గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో చూపడం లేదు. పెళ్లకూరు మండలంలో ఉన్న పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా పొగ, వ్యర్థాలు విడుదలై ప్రజలు రోగాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదు. కాలుష్య నియంత్రణ అధికారులు పరిశ్రమల వైపు కన్నెత్తి చూడడం లేదు. నిరంతరం రోగాలతో సతమవుతున్నామని, కాలుష్యం కోరల నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

- పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, వ్యర్థాలు
- శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ అధికారులు



శిరసనంబేడులో ఉన్న స్టీల్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న పొగ

పెళ్లకూరు : మండలంలోని పెన్నేపల్లి, శిరసనంబేడు గ్రామ సమీపంలో పదిహేనేళ్ల క్రితం స్టీల్ పరిశ్రమలు ఏర్పాటుచేశారు. వాటి నుంచి వచ్చే పొగను ఎత్తైన గొట్టాల నుంచి విడుదల చేయాలని నిబంధనలు ఉన్నాయి. వ్యర్థాలను దూర ప్రాంతాలకు తరలించాల్సి ఉంది. కంపెనీ యాజమాన్యం చిన్నపాటి గొట్టాన్ని ఏర్పాటు చేసింది. యంత్రాలు, మండుతున్న కొలిమి నుంచి వచ్చే పొగను నేరుగా బయటకు వదిలేస్తున్నారు. దీంతో సుమారు ఆరు కిలోమీటర్ల మేర పొగ దట్టంగా కప్పేస్తోంది. ముఖ్యంగా పెన్నేపల్లి, కానూరు, తాళ్వాయిపాడు, శిరసనంబేడు, రాజుపాళెం, చెన్నప్పనాయుడుపేట, జీలపాటూరు తదితర గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గాలి కాలుష్యంతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను చెరువులు, వ్యవసాయ పొలాల్లోకి వదిలేస్తుండడంతో సాగు, తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు.

కార్మికులకు రక్షణ కరువు

శిరసనంబేడు, పెన్నేపల్లి గ్రామాల్లో ఉన్న పలు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు తగిన రక్షణ కల్పించడం లేదు. ప్రమాదకరమైన యంత్రాల వద్ద పని చేస్తున్న కార్మికులకు రక్షణ కవచాలు అందుబాటులో ఉంచాల్సి ఉంది. ఆ దిశగా యాజమాన్యాలు చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది మృత్యువాత పడ్డారని, మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా మండే కొలిమిలో పడేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగినా సమాచారం బయటకు పొక్కకుండా తొక్కిపెడుతున్నారని పేర్కొంటున్నారు. నిబంధనలు పాటించని పరిశ్రమలపై తీసుకుంటున్న చర్యల గురించి వివరణ తీసుకోవడానికి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డును ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించినా అధికారులు అందుబాటులోకి రాలేదు.

పట్టించుకోని అధికారులు

పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలతోపాటు పొగ తదితరాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి కాలుష్య నియంత్రణ అధికారులు పరిశీలించాలి. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా రక్షణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. తనిఖీల పేరుతో పరిశ్రమలకు వచ్చే జిల్లా ఉన్నతాధికారులు మామూళ్లు తీసుకుని అంతా సవ్యంగా ఉన్నట్టు రికార్డుల్లో నమోదు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పరిశ్రమ నుంచి విడుదలవుతున్న కాలుష్యంపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కలువాయిలో వాలీబాల్ పోటీలు

కలువాయి: మండల కేంద్రమైన కలువాయిలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కలువాయి యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బి.నాగరాజు తెలిపారు. కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 10 నుంచి 13వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో కలువాయి, చేజర్ల, రాపూరు, అనంతసాగరం మండలాల క్రీడా జట్లు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంట్రీ రుసుము రూ.600 చెల్లించాలని, విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.2,500 అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 7702966728, 7093111219 నంబర్లకు కాల్‌చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

భగవతి మల్లికాంబకు ప్రత్యేక పూజలు



లక్ష కుంకుమార్చన చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జయంతి సందర్భంగా సహస్ర నామాలతో లక్ష కుంకుమార్చన చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపకులు అమాస రామనారాయణ, జి.సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దక్కిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందులో పలు అంశాలపై సమీక్ష ఉంటుందని, అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని సూచించారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

చేతివృత్తిదారులకు ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న టీఎంసీ సౌజన్య, వైస్ చైర్మన్ షేక్ రఫీ

నాయుడుపేట టౌన్ : చేతివృత్తిదారులు వారు నైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తోందని మెప్మా టీఎంసీ సౌజన్య తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం చేతివృత్తిదారుల పేర్ల నమోదును చేపట్టారు. ఆమె మాట్లాడుతూ వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్‌లు, బ్యూటీషియన్ తదితర పనులు చేసేవారు ఆన్‌లైన్‌లో శిక్షణ పొందవచ్చన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీవో నారాయణమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



మేత భూముల్లో వేసిన వరినాట్లు

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరులో మేత భూముల ఆక్రమణలపై రెండు నెలల క్రితం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, గ్రామస్తులు ఆరోపించారు. వారు సోమవారం మరోసారి గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిల్లకూరులోని సర్వే నంబరు 3లో ఉన్న మేత భూములను గ్రామానికి చెందిన మద్దూరు రమణయ్య, మద్దూరు అంకయ్య, మద్దూరు గిరి, ఒలిపి దయాకర్ ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. దీంతో గ్రీవెన్స్‌డేలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణ భూముల్లో వరి నాట్లు వేశారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో ఉన్న మేత భూములను పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు.

నరకప్రాయం.. రైలు ప్రయాణం



గూడూరు రైల్వే స్టేషన్‌లో మెమూ రైలు ఎక్కేందుకు కుస్తీ పడుతున్న ప్రయాణికులు



రైలులో నిలుచుని ప్రయాణిస్తున్న ప్రయాణికులు

- మెమూ రైలుకు కూడా ఎక్స్‌ప్రెస్ చార్జీ వసూలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

చిల్లకూరు : మండలానికి చెందిన రైలు నిత్యం రద్దీగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిట్రగుంట నుంచి చెన్నై వెళ్లే మెమూ రైలు ప్రతిరోజూ ఉదయం 6.18 గంటలకు గూడూరుకు చేరుకుంటుంది. ఉన్నది ఒక రైలే కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. సీట్ల కోసం ప్రయాణికులు కుస్తీలు పట్టాల్సి వస్తోంది. గతంలో బిట్రగుంట నుంచి ప్యాసింజర్ రైలు నడిచేది. దాని తర్వాత నెల్లూరు నుంచి మెమూ రైలు నడిచేది. ఇవి కూలీలు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులకు ఎంతో అనుకూలంగా ఉండేవి. బిట్రగుంట నుంచి వచ్చే మెమూ రైలును కోవిడ్ సమయంలో రద్దు చేశారు. తర్వాత బిట్రగుంట నుంచి చెన్నైకి మెమూ ఎక్స్‌ప్రెస్ పేరుతో రైలును నడపడం మొదలు పెట్టారు. ఇందులో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తుండడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వందే భారత్ రైళ్లను ప్రవేశ పెట్టి పేదల పట్ల నిర్దయగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి, చెన్నై మార్గాల్లో పేదలకు సౌకర్యవంతంగా ఉండేలా మెమూ రైళ్లు నడపాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేదు. ఈ దఫా చేపట్టే రైల్వే బడ్జెట్‌లోనైనా మెమూ రైళ్లను ప్రవేశ పెట్టి పేదలకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఓజిలి : కొత్తపేటలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న డీటీ మధుసూదన్‌రాజు

ఓజిలి: భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు డీటీ మధుసూదన్ రాజు తెలిపారు. మండలంలోని కొత్తపేట, జ్యోష్యులవారికండ్రిగ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, రీసర్వే మార్పులు చేర్పులను చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌నాయుడు, నాయకులు ప్రసాద్‌నాయుడు, నిరంజన్, రాజశేఖర్, గాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలకు సత్వర పరిష్కారం

కోట : రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చే అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులను ఆదేశించారు. మండలంలోని కేసవరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కేసవరంలో పంచాయతీలో భూసమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ జయ జయరావు, ఎంపీడీవో వేణు పాల్గొన్నారు.

మహిళా వీఆర్‌ఏ మృతి

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ గాయం పుల్లమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 వేల నగదును డీటీ సందీప్ కుమార్ అందజేశారు.

గ్రీవెన్స్‌డేకు మూడు అర్జీలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రాజేంద్ర తెలిపారు. పండ్లూరు గ్రామ సమీపంలో ఉన్న ఇటుకల పరిశ్రమ వద్ద పంట కాలువలను ఆక్రమించుకున్నారని, పరిశ్రమ నుంచి వచ్చే కలుషిత నీటిని పొలాల్లోకి వదులుతున్నారని అంబటి కస్తూరయ్య ఫిర్యాదు చేశారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని మంగళపూరు ప్రాంతంలో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ వసంతకుమార్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఉన్న మినరల్స్ మైనింగ్ యాజమాన్యం అనుమతులు తీసుకోకుండా 20 ఎకరాల్లో మైనింగ్ చేస్తున్నట్టు తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మైనింగ్‌ను నిలిపి వేయాలని కోరారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ జలం, పసుపు, కుంకుమ, విభూది తదితరాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సైదాపురంలో నర్సరీ ఏర్పాటు

- అడవుల్లో సంచరించినా కేసులు నమోదు - నెల్లూరు అటవీ శాఖ రేంజర్ వెల్లడి



నర్సరీని పరిశీలిస్తున్న రేంజర్ మాల్యాద్రి

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీలో అటవీ శాఖ పర్యవేక్షణలో నర్సరీని ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు అటవీ శాఖ రేంజర్ మాల్యాద్రి తెలిపారు. ఆయన సోమవారం నర్సరీని ఏర్పాటు చేయనున్న స్థలంతోపాటు రామసాగరం, వేములచేడు, చాగణం అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సైదాపురంలో 5 ఎకరాల్లో శ్రీసిద్ధలయ్య కోన సెంట్రల్ నర్సరీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో రైతులకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రసుతం అటవీ ప్రాంతాల్లో కూడా ఎవరైనా సంచరించినా కేసులో నమోదు చేస్తామని పేర్కొన్నారు. అటవీ సిబ్బంది ఎం.శ్రీనివాసులు, రవిశేఖర్, విజయకుమార్, గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఊటుకూరు మహేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

నాయుడుపేట టౌన్ : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో సోమవారం నాయుడుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పార్టీ పటిష్టతకు చేస్తున్న కార్యక్రమాలపై చర్చించారు.

పెద్దిరెడ్డిని కలిసిన మహేంద్రరెడ్డి

గూడూరు రూరల్ : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని సోమవారం గూడూరు రూరల్‌కు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఊటుకూరు మహేంద్రరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పరిస్థితిపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, క్రిష్ణయ్య, రవిరాజు, రాజశేఖర్, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిలో వ్యర్థాలు వేస్తే చర్యలు



స్వర్ణముఖి నది వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నాయుడుఏపేట టౌన్ : నాయుడుపేట స్వర్ణముఖి నదిలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా హెచ్చరించారు. ఆయన సోమవారం కార్మికులతో కలిసి స్వర్ణముఖి నదిలో ప్రతి ఏటా నిర్వహించే ఏటి పండుగ సంబరాల కోసం చెత్తాచెదారం తొలగించే పనులు చేయించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేట నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యర్థాలు, చెత్తాచెదారం తీసుకువచ్చి స్వర్ణముఖి నదిలో వేస్తున్నారని తెలిపారు. దీంతో నది కలుషితమవుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా వాహనదారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. నది వద్ద మున్సిపల్ సిబ్బందిని ఏర్పాటు చేసి వ్యర్థాలు వేసే వారి వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు.

ఎన్నికల హామీలు అమలుచేయాలి

సూళ్లూరుపేట : చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి ఇలపా నాగేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో అభివృద్ధిని మరిచిపోయి ప్రతిపక్షాల మీద విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. విమర్శలు మానేసి ఎన్నికల హామీలను అమలు చేయడంలో చొరవ చూపాలని కోరారు. లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మోదుగుల పార్థసారథి, మోదుగుల రమణయ్య, జిల్లా సమితి సభ్యులు శ్రీనివాసులు, కుమార్, బాలు, లక్ష్మమ్మ, వెంకటకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.